# మల్లి మీద మమకారం



రాత్రి భోజనంచేసి, 'బాబి' ని కడుపు మీద పడుకోబెట్టుకొని దొడ్డి వాకిట్లో వాల్చిన మడతమంచంమీద నడుం వాల్చాడు ప్రకాశం. 'బాబి' కడుపుమీద పడుకోకుండా లేచికూర్చుని ఆకాశంలో మినుకు మినుకుమనే నక్షత్రాలవైపు వేలుతో చూపుతూ తండ్రి గెడ్డం పైకెత్తి చూడమంటున్నట్టు సంజ్ఞలుచేస్తున్నాడు. ఏదో ఆలోచిస్తున్న ప్రకాశానికి 'బాబి' మూకభాషను అర్థంచేసికోగల సత్తా లేక పోయింది. అయినా, 'బాబి' మాత్రం తన అవ్యక్తానందాన్నను భవిస్తూ, ప్రకాశాన్ని అందులో భాగం స్వీకరించమని ప్రోత్సహిస్తూనే ఉన్నాడు. మడతమంచానికి [illegible]రెడు దూరంలోఉన్న మల్లి పందిరిమీద [illegible]వ్వల సువాసన మత్తెక్కిస్తూన్నది. ఇది [illegible]రలో ప్రకాశం ఆ పూలవాసన మత్తులో కన్నుమూసి హాయిగా నిద్రించేవాడు. ఇప్పుడు ఆ పూలవాసనే అతనికి తగలటం లేదు. అతని సౌఖ్యంకోసం శ్రీమతి ప్రమీల కొన్ని పువ్వులను కోయటమే మానేసేది. కోసిన వాటిలో కొన్నిటిని అతని ప్రక్క మీద్దనే విరజిమ్మేది. మల్లెలంటే మహా ప్రీతి ప్రకాశానికి.

ఒకనాడు కాలేజీనుంచి తిరిగి యింటికి వస్తున్నాడు. నెలరోజుల వ్యవధిలో రాబోయే పరీక్షలను గురించి ఆలోచించే అతని మనస్సు ఒక్కసారిగా ఏదో అనుభూతిని పొందింది. ఎదురుగా వెళ్లే ఒక అమ్మాయి తలలోని మల్లెలవాసన అతని ఆలోచనను అరికట్టి, మనస్సును, కన్నులను అటు త్రిప్పినది అతని ఘ్రాణేంద్రియం వేగంగా పనిచేయసాగింది. అలా అతను అజ్ఞాతంగా ఆమె వెనకాలే ఎంతో దూరం నడిచిపోయాడు. వాస్తవానికి అతను ఎటు నడుస్తున్నదీకూడా తెలీదు. ఆ అమ్మాయి తలలోని మల్లెలు అతని కన్నులను ఆకర్షిస్తే, ఆ మల్లెపూల పరిమళం అతని నాసికకు త్రాడువేసి లాక్కుపోతున్నది. అలా నడిచి, నడిచి ఒకచోట ఆగిపోయాడు. అప్పటికతనికి స్మృతివచ్చింది. ఏమిటిది? అనుకున్నాడు. ఆ రోజు సాయంత్రం తన స్నేహితుడు చేయబోయే సంగీతకచేరీకి తప్పకుండా హాజరవుతానని యిచ్చిన వాగ్దానం అప్పుడు జ్ఞప్తికివచ్చింది. తటాలున వెనుదిరుగబోతుండగా ఆ అమ్మాయి పిలిచింది. ఆమె ఎవరోకాదు. తన క్లాస్ మెట్. ఇంకా తన గ్రూప్దికూడా! ఆమెను అతను ఎరుగు; అతన్ని ఆమెకూడా ఎరుగును.

అయితే ఆ పరిచయం కాలేజీ గోడల మధ్యనే. అదికూడా చదువుకు సంబంధించినంతవరకే. అతనెప్పుడూ ఆమెవైపు కన్నులుంచేసి పిచ్చి, పిచ్చి ప్రసంగాలు చేయలేదు. నోట్సు పుస్తకాలిస్తూ ప్రేమగీతాలు వ్రాయలేదు. ఏదో జీవనదిలో కలిసికొట్టుకొనిపోయే రెండు కర్రలకున్న సంబంధం వారికి ఉన్నది. రెండు, మూడుసార్లు ఆమె ఆహ్వానించింది. అలాగేనని వెళ్ళటం మానేశాడు. ఈ రోజున ఆమె వెనకాలే తనకు తెలీకుండా వెళ్ళి గుమ్మంలో నిలబడిపోయాడు. ఈ సమయంలోకూడా ఆమె ఆహ్వానాన్ని కాదనటం సభ్యంగా తోచలేదు. తలయెత్తకుండానే మెట్లెక్కాడు. ఆమె లోపలకు తీసికెళ్ళి, తనగదిలో కుర్చీ చూపి, లోపలకు వెళ్ళి కాఫీ, బిస్కట్లు తీసికొనివచ్చి అతని కెదురుగాఉన్న స్టూల్ మీద ఉంచి తాను మరోకుర్చీ లాక్కుని కూర్చున్నది. ఇరువురూ ఆరగించారు. ఆ రోజున ఆమె ఏమేమో మాట్లాడింది. తను కొంతసేపు సంకోచించినా, తరువాయి ఆమెను అధిగమించి ప్రసంగించాడు. కొంతసేపటివరకూ చదువు, పరీక్షలు. ఆ తరువాయి సినిమాలు. ఆ తరువాయి ప్రపంచ విషయాలు. అంతే! అతను లేచాడు. అప్పుడప్పుడు వస్తూండమంది అప్పుడు అతనన్నాడు.

"ఈ రోజున యిలా ఎందుకు వచ్చానో మీకు చెప్పటం అవసరం. ఇదివరలో మీరు ఎన్నిసార్లు పిలిచినా నేను అలానే అంటూ, రావటం మానేసేవాణ్ణి. కాని ఈ రోజున మీ తలలోని మల్లెలు నన్ను మీ వెనకాలే నడిపించినై. మల్లెపువ్వులు నన్ను మత్తెక్కిస్తై"

అని నవ్వుతూ లేచాడు. అది మొదలు అతను అప్పుడప్పుడు ఆ యింటికి వెళ్ళేవాడు. ఒక్కొక్కరోజు చాలా ప్రొద్దుపోయేవరకూ కూర్చునేవాడు. అతన్ని భోజనం చేయమనటానికి ఆమె సంకోచించేది. అతను సాహసించి అడగలేకపోయేవాడు. ఆఖరుకో రోజున ఆమె చెల్లెలు సాహసించి భోజనానికి లెమ్మంది. అతను సభ్యతకోసం కొంత అభ్యంతరంచెప్పినా ఆఖరుకు అంగీకరించాడు. అప్పట్నుంచీ మరి కాస్త సాన్నిహిత్యం ఏర్పడింది. అప్పుడప్పుడు కొద్ది, కొద్దిగా వేళాకోళాలు పరీక్షలు ఆ సాన్నిహిత్యాన్ని మరీ దృఢం చేసినై. శకుంతల నాటకం చదువుతుంటే యిద్దరూ చెరోకపాత్రస్వీకరించేవారు 'ట్వెల్ నైట్' చదివేప్పుడూ అంతే. దీనికి తోడు ఆమె చెల్లెలు అప్పుడప్పుడు 'బావగారూ' అంటుండేది. అటువంటప్పుడు ఆమె సిగ్గుతో కన్నులరమోడ్చి తనవైపు జూచేది. అంతకంతకు ఆమె చెల్లెలే తమ బాంధవ్యాన్ని మరీ దగ్గర చేసేసింది. అతను 'నువ్వు—నువ్వు' అని ఏకవచన సంబోధనచేయటం, ఆమె మాత్రం 'మీరు' అనే పిలుస్తూండటం, ఇలాటివెన్నో జరిగిపోతున్నై. ఆ రోజుల్లో అతను కాని, ఆమె కాని వీటిని వేటినీ అంత ప్రధానమైనవిగా పరిగణించలేదు. కాని ఆ యింట్లో మాత్రం ఈ యిరువురి స్నేహాన్నిగురించి కొన్ని నిశ్చయాలు జరుగుతునై. ఒక్కొక్కనాటి అతని ప్రవర్తన వాళ్ళ నిశ్చయాలన్ను తలక్రిందులు

# ★ మల్లిమీద మమకారం ★

చేస్తే, మరోరోజున అతని సంభాషణ వాళ్ళ అభిప్రాయాలను ఘట్టిపరచేది.

ఆమె వారాని కొక్కసారి మాత్రమే మల్లెపువ్వులు పెట్టుకోవటం మొదలు పెట్టింది. కాని రోజూ ఆమె చెల్లెలు అలంకరించుకొనేది. ఒకే గదిలో ముగ్గురూ కూర్చొని చదివేవారు. ఆ మల్లెలు మత్తెక్కిస్తూన్నంతసేపు అతని దృష్టి మల్లెలమీద నుంచి మరలేదికాదు. పుస్తకంలోకి చూచేవాడే కాని ఆమె ఏం చదువుతున్నదీ తెలిసేదికాదు. ఆమె ఏదయినా అడిగితే 'ఔను'—'కాదు' అని అస్తవ్యస్తంగా జవాబిచ్చేవాడు. ఆఖరుకు అతని దృష్టి పుస్తకాల్లోకి మళ్ళటానికి కొంచెం శ్రమ తీసికోవాల్సివచ్చింది.

మల్లెలు ప్రతిరోజూ ముణుచుకోవద్దని చెల్లికి చెప్పింది. కాని ఆమె కొంచెం తిక్కది, మరి కొస్త పెంకిది, కావటంవల్ల వినిపించుకోలేదు. ఆఖరుకు చదువు గది మార్చేసింది. అయితే మల్లెల వాసన తగిలితేనే కైపెక్కుతాడు కాని, దానికోసం తహతహలాడడు. అక్కడికి ఏ తొమ్మిది గంటలకో చెల్లి ఒక్కసారి ఆ గదిలోకి వచ్చి రెండు నిమిషాలు పంకాప్రక్క నిలబడి కైపెక్కించి వెళ్ళిపోయేది. ఒక రోజున అక్కా-చెల్లెలు ఆ విషయంలో అతను లేనప్పుడు ఘర్షణపడ్డారు కూడా. ఆఖరుకు తండ్రి కలగజేసికొని వారించాడు.

ఇలా మల్లెలతో ముక్కుకు త్రాడేసిన ఆమె చివరకు జీవితంలో అర్ధాంగిఅయింది. అర్ధాంగి కావటానికి ముందు చాలా తతంగం జరిగింది. ఏమయితే నేం పర్యవసానం ప్రమోదమే అయింది.

ఈ మల్లెఅంటు ఆమె కాపురాని కొచ్చిన తొలి రోజుల్లో నాటింది. అప్పట్నుంచి దాన్ని ఎంతో శ్రద్ధతో పోషించింది. ఆకులు దూయటం, దూసిన ఆకులన్నీ మొదట్లోపోసి నీరుపెట్టటం, పురుగు పట్టకుండా చూస్తూండటం ... ఇలాంటి వానితో ఆ పందిరి మరీలా వ్యాపించింది.

చైత్రం ప్రవేశిస్తుండగా అది గుమ్మన వాసనలీనేది. వసంతాగమనాన్ని మల్లె వాసనతోనే అతను గుర్తించేవాడు. ఆమల్లి పందిరివార ఆమెతో అతని జీవితం ఎన్నో అనుభూతులను పొందింది. ఆ మల్లి అతని చేత ఎన్నో కథలు, నాటికలు, వ్యాసాలు వ్రాయించింది. అదే మల్లి అతనికి వేసవి తాపం కలుగకుండా చేసేది. ఆ మల్లి దగ్గర నిలబడి ఉండగానే ఆమె పుట్టింటినుంచి 'బాబి'ని చంకనెట్టుకువచ్చి నవ్వుతూ నిలబడ్డది. అలా ఆ మల్లితో అతని కెంతో సంబంధం.

ఇంక రెండు రోజులు. ఆ రెండు రోజుల్లో యిల్లు అప్పులవాళ్ళ వశమై పోతుంది. ఇల్లు పోతే యింకో యిల్లు వస్తుంది. కాని మల్లి. మల్లిమాత్రం యింకొటి రాదూ! ఊహూఁ. తన జీవితంతో ఎంతో సన్నిహితంకలిగిన యీ మల్లి! నిజంగా మల్లి యిల్లాలులానే ఉంది! ఆమె తన జీవితంలో ప్రవేశించటానికి కారణభూతమయిన మల్లెలనుపుష్పించిన అంటుతొలూకు కొమ్మపాతిన ఈ మల్లి తన జీవితంనుండి వేరుకావటం అతనికి దుర్భరంగా ఉంది. మల్లిని మరచిపోవాలనుకున్నాడు. అందుకే బలవంతంగా ఆలోచనలోపడి మల్లి వాసనలను దరిజేరనీయటం లేదు.

అతనికి తెలీకుండానే అతని కన్నులు అర్ధనిమ్మలై, కనుగొలకులు నీటితో నిండినై. కంచాలు తొలిచి, వంటింటి పనులు పూర్తిచేసికొని వచ్చిన ప్రమీలాదేవి బిడ్డను భర్త కడుపుమీదనుంచి తీసికొని, చంకలోకి ఎత్తుకొని:

"మీరింకా ఆలోచిస్తూనే ఉన్నారు. ఏమిటో ఈ యిల్లు మనం సంపాయించాం కనకనా! మనదిగా ఉండిపోవటానికి. మీ నాన్నగారు చెమటోడ్చికట్టారు. ఆయన ఉన్నంతకాలం అనుభవించారు. మనం కూడా కొంతకాలం యిందులో జీవించాం. అంతే! దీనికీ, మనకూ రేపటితో ఋణానుబంధం తీరిపోతుంది. ఇప్పుడు మాత్రం ఏం పోదాం. సరోజిని యిల్లు మనకు పరాయిదా. ఇదివరకే అది దాని యింటికివచ్చి ఉండమంది. దానికి మాత్రం ఎవరున్నారు చెప్పండి. ఈ మూడేళ్ళ నుంచీ దాని చెల్లెలు మొగుడుకి ఇక్కడ ఉద్యోగం కనుక వాళ్ళిద్దరూ ఉన్నారు. నిన్ననే వాళ్ళు వెళ్ళిపోయారట మనం దానికి సాయంగా ఉంటే, అది మనకు పెద్ద దిక్కుగా ఉంటుంది"అంది, మంచంమీద పొట్ట మోపుగా కూర్చుంటూ.

"నేనూ అదే ఆలోచిస్తున్నాను. ఈ యింటిమీద నాకేం మమకారం లేదు. కాని, ఈ మల్లి..."

అంటూనప్పు డతని గొంతు బొంగురు పోయింది.

"మీరు మరీ అరోమయమైపోతున్నారు. ఏమిటో! అనుదినం దాని రక్షణ చేసిన నేనే నిర్వికారంగా ఉంటే, ఇంక మీరు ఇదేమిటి చెప్పండి. అసలు పువ్వులన్నా, నగలన్నా ఆడదానికున్న మమత

> "మీ అమ్మాయిని నేను పదిహేను ఏళ్ళుగా ప్రేమిస్తున్నానండీ?"
> "అయితే ఏమంటావు?"
> "పెళ్ళి చేసుకొంటాను."
> "ఓస్! ఇంతేనా! ఇంకా పెన్షన్ అడుగుతావేమో నని హడిలి పోయాను!"

మగవాళ్ళకుండనే ఉండదు. అయినా పరిస్థితులు ప్రతికూలించినప్పుడేం చేస్తాం. ఒక్క విషయం ఆలోచించండి. ఆరు కాసుల చంద్రహారం, రెండుకాసుల పతకం గొలుసు, ఆఖరుకు మంగళసూత్రాలతాడు, అదే అన్నమాటేమిటి? బాబిమొలకు రెంతేళ్ళక్రితం ఎంతో కుతూహలంతో మీరు చేయిద్దామనుకుంటుంటే మా నాన్న తెచ్చిన మామిడిపిందెల బంగారుమొలత్రాడు, ఇవన్నీ మనకు అక్కర్లేనివేనా! కాని ఒక్కగుక్క దిగమ్రింగి జేబురుమాల్లో చుట్టబెట్టుకొని వెళ్ళి మనకు లేకుండా చేసికోలేదూ. ఇంక ఈ మల్లి... అదీకాక సరోజిని యింట్లో దీని తలదన్నే మల్లిపందిరిఉంది. అది దొంతరమల్లికూడా" అని అతనివైపు చూచింది.

"హూఁ! ప్రమీలా, ఏదో జరుగుతు నువ్వు నన్ను కట్టుకున్నావ్. నిజంగా వెంకటేశ్వరరావుని చేసికొనుంటే అతను కూడా మీ నాన్నలా తాసిల్దారు హోదాలో ఉండి మీ అమ్మకు జరిగే సౌఖ్యాలు నీకు జరిపేవాడు "అన్నాడు, చాలా దీనంగా.

"మీకు నన్ను కూడా ఏడిపించాలని ఉందా? ఇప్పుడేదో-తెలీక నగల విషయం ఎత్తానుగాని ఎప్పుడన్నా నేను వాటిని స్మరించానా? అదీకాక అవసరానికి ఉపయోగపడని బంగారం శరీరానికి బరువేకాని అలంకారమవుతుందా?"

అంటూ అతని నుదురుమీద చెయ్యివేసి, ముంగురులు నిమరసాగింది. పైట చెంగులో దూరి పాలుత్రాగే 'బాబి' గుర్రుకొట్టటం చూచి, మంచందిగి ప్రక్క మంచంమీద పండబెట్టి తిరిగి అతని వద్దకు వచ్చి:

"ఒక్కసారి దిగండి. ఈ రాత్రితో మనం ఈ మల్లిని మరచిపోవాలి. రండి. మొత్తం పువ్వులన్నీ కోసిపారేసి ప్రక్కమీద జల్లుకుందాం. రేపట్నుంచి సరోజిని యింట్లో దొంతరమల్లి పాన్పు..." అని నవ్వింది. అతను లేస్తూ: "దొంతరమల్లి మల్లిని మరపిస్తుందా?" అనుకున్నాడు. ★